167) శ్రీ

ప|| లావణ్యశృంగారరాయ లక్ష్మినాథ । యేవేళ నీవినోదాన కేదాయ నేమి ||

చ|| పాలజలధివంటిది పవ్వళించు నామనసు । గాలివూర్పులే కడళ్ళు కలదు లోతు ।
చాలగ దొల్లి నీవు సముద్రశాయివట । యీలీల నీవినోదాన కేదాయ నేమి ||

చ|| నిక్కపుభూమివంటిది నెలవుకో నామనసు । పెక్కులిన్నియు గలవు పెరుగుచుండు ।
పుక్కట దొల్లియు నీవు భూసతిమగడవట । యెక్కువ నీవినోదాన కేదాయ నేమి ||

చ|| నిండుగొండవంటి దిదె నిలుచుండు నాభక్తి । వుండుచోటనేవుండు నొక్కచోటను ।
కొండలరాయడవట కోరికె శ్రీవేంకటేశ । అండ నీవినోదానకేది యాయ నేమి ||